క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె పంచాముఖ ఆంజనేయస్వామి, ఎర్రకోటపల్లెలోని కోటమిట్ట ఆంజనేయస్వామి, గోపావలురంలోని శ్రీసాయిబాబా ఆలయంలో, శ్రీగురుదత్తాత్రేయస్వామి ఆలయంలో ప్రత్యేక పౌర్ణమి పూజలు, అభిషేకాలు, భజనలు చేశారు. సోమవారం రాత్రి పౌర్ణమి సందర్భంగా అనేక మంది భక్తులు ఆలయాలకు చేరుకుని మంగళవారం ఉదయం వరకూ భక్తి గీతాలతో భజన చేశారు. మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

బీఎల్ఓలతో తహసీల్దార్ సమీక్ష

పెద్దతిప్పసముద్రం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం మండలంలోని బూత్ లెవల్ అధికారులు (బీఎల్వో)లతో తహసీల్దార్ శ్రీరాములు నాయక్ సమీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్వోలు ఇంటింటికీ వెళ్ళి ఓటరు జాబితాను క్షుణంగా పరిశీలించాలని, మార్పులు, చేర్పులపై సమగ్రమైన ఆధారాలు తీసుకుని తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సమావేశంలో డీటీ విద్యాసాగర్, ఆర్ఐ అనీషా, బీఎల్వోలు పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

గుర్రంకొండ : మండలంలోని ఎల్లుట్ల పంచాయతీ ఇ.పసలవాండ్లపల్లెలోని ఓదుకాణంలో అక్రమంగా ఉంచిన 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. గ్రామంలోని పసల హరికృష్ణారెడ్డి అనే వ్యక్తి చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇదే దుకాణంలో గత కొంతకాలంగా మద్యం బాటిళ్ల విక్రయిస్తూ బెల్టుషాపు కూడా నిర్వహిస్తున్నాడనే సమాచారం అందుకొన్న పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అతని దుకాణంలో విక్రయించడానికి ఉంచిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని నిర్వాహకుడు హరికృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రామకోటి పుస్తకాలు పంపిణీ

గుర్రంకొండ : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రామకోటి పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ఓనిలో ఆంజినేయస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు రామనామాద క్షేత్రం వారు ఉచితంగా అందజేసిన రామకోటి పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భం తిరువీధి శ్రీధర్ మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా సంఘటనా కార్యదర్శి రమేష్, సేవాప్రముఖ్ ఉప్పు శ్రీనివాసులు, భజరంగదళ్ కార్యదర్శి మల్లయ్య, మాతృశక్తి రామలక్ష్మీ, శేషాద్రినాయుడు, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

తంబళ్లపల్లె : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోసువారిపల్లె మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుపమ తెలిపారు. మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో ఇంటి పరిసరాలను శుభ్రతతో పాటు మురికినీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. వ్యాధులు బారిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మునికుమార్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా సులేమాన్

మదనపల్లె : అఖిల భారత బీసీ సమాఖ్య(ఏబీబీఎస్) జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన షేక్ సులేమాన్ నియమితులయ్యారు. మంగళవారం ఏబీబీఎస్ జాతీయ అధ్యక్షులు, వ్యవస్థాపకులు ఎస్.శ్రీనివాసు షేక్ సులేమాన్‌కు నియామక పత్రం అందజేశారు. జిల్లాలో బీసీ కులాల ఐక్యతకు కృషి చేయడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి పని చేయాలని సులేమాన్‌కు సూచించారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

మదనపల్లె : పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని మదనపల్లె డివిజన్ పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పశుసంవర్ధకశాఖ డీడీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జీవాలకు వచ్చే గాలికుంటు వ్యాధిపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువులు నీరసించిపోతాయని, పాలదిగుబడి తగ్గిపోవడమే కాకుండా చూడి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. వ్యాధి నివారణకు పశు సంవర్ధకశాఖ వైద్యుల సలహాలు తీసుకుంటూ క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. గాలికుంటు వ్యాధి టీకాలను ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు వేయనున్నట్లు తెలిపారు. ఉచిత టీకా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

పెద్దమండ్యం : పెద్దమండ్యం ఎంపీడీఓగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన వెంకటరమణయ్యను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎన్నికల విధులలో భాగంగా ఇక్కడ ఆరు నెలల పాటు విధులు నిర్వహించిన ఎంపీడీఓను వైఎస్సార్‌జిల్లా పెద్దముడియంకు తిరిగి ఉన్నతాధికారులు బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీడ్కోలు సమావేశాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది బదిలీపై వెళ్లిన ఎంపీడీఓను సన్మానించారు.

నర్సరీల్లో నాసిరకం నారు సాగు

- నాసిరకం మొక్కలతో నష్టం
- లోపిస్తున్న మొక్కల నాణ్యత
- నష్టపోతున్న రైతన్నలు
- కొరవడిన ఉద్యాన శాఖ అధికారుల పర్యవేక్షణ



నర్సరీలో సాగు చేస్తున్న కూరగాయల మొక్కలు

పెద్దతిప్పసముద్రం : అన్నదాతలు సాగు చేసే పంట దిగుబడి ఆశాజనకంగా రావాలంటే విత్తన నాణ్యత బాగుండాలి. లేని పక్షంలో రైతులు ఎంత పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసినా ఫలితం ఉండదు. కూరగాయల పంటల దిగుబడి బాగా ఉండాలన్నా విత్తన మొక్కల నాణ్యత బాగుండాలి. లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

నర్సరీలు పాటించాల్సిన నిబంధనలు

నారు పెంచే నర్సరీ చుట్టూ ఇన్‌సెక్ట్ నెట్ ఉండాలి. ఇన్‌సెక్ట్ నెట్‌కు ఎలాంటి చిల్లులు ఉండరాదు. డబల్ డోర్‌కు ఎలాంటి సందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. షెడ్ నెట్‌కు మూడు అడుగుల విస్తీర్ణం వరకు ఎలాంటి కలుపు చెట్లు ఉండకూడదు. నర్సరీ లోపల పసుపు రంగు జిగురు అట్టలు ఉంచాలి. నర్సరీ లోపల వైరస్ నిర్మూలనకు చుట్టూ ట్రాప్ క్రాప్ (బంతి మొక్కలు) వేయాలి. నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన కంపనీ బిల్లులు తీసుకోవాలి. నర్సరీకి సంభంధించిన ఏడు రిజిస్టర్లలో అన్ని వివరాలు సమగ్రంగా నమోదు చేయాలి. నర్సరీ లైసెన్స్ నంబర్ ప్రింట్ చేసిన బిల్లులు మాత్రమే నారు కొనుగోలుదారులకు ఇవ్వాలి. అయితే అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే కావడంతో నర్సరీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కోకొల్లలు.

పెరిగిన పోటీతత్వం

వ్యాపారంలో పోటీతత్వం పెరిగిపోతోంది. ఏ నర్సరీలో ధర తక్కువగా ఉంటే అక్కడ కూరగాయల మొక్కలను కొనుగోలు చేస్తున్నారే గాని మొక్కల నాణ్యతను చూడటం లేదు. నాణ్యత లేకుంటే దిగుబడి రాదు. ఫలితంగా రైతులకు పెట్టుబడి కూడా చేతికి దక్కదు. తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా ఉద్యానవన శాఖ అధికారులు పుట్ట గొడుగుల్లా వెలసిన నర్సరీలను పర్యవేక్షించి, అక్రమ నర్సరీలకు రిజిస్ట్రేషన్ చేయించి, రైతులకు విక్రయించే మొక్కల నాణ్యతను క్షుణంగా పరిశీలించి, కూరగాయల మొక్కల నాణ్యతపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొరవడిన ఉద్యానవన శాఖ అధికారుల పర్యవేక్షణ

విత్తన మొక్కల నాణ్యత పర్యవేక్షించాల్సిన ఉద్యానవన శాఖ అధికారులు ఉదాసీనత వహిస్తున్నారు. అధికారుల నుండి ఎలాంటి అనుమతులు లేకుండా పలు మండలాల్లోని ఎన్నో చోట్ల పదుల సంఖ్యలో నర్సరీలు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని ప్రజల్లో ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. టమాటా, మిరప, వంకాయలతో పాటు ఇతర కూరగాయల మొక్కల పెంపకాన్ని నర్సరీ నిర్వాహకులు చేపడుతున్నారు. 2006 ఉద్యాన శాఖ చట్టం ప్రకారం నర్సరీలు ఏర్పాటు చేసే ముందు నిర్వాహకులు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఉద్యాన శాఖ అధికారులు తరచూ నర్సరీలకు వెళ్లి కూరగాయల మొక్కల నాణ్యతను పర్యవేక్షించాలి. నిర్వాహకులు పెంపకం చేసే మొక్కలను ఏ రైతులకు విక్రయిస్తున్నారో రశీదు రూపంలో చూపాల్సి ఉంది. అయితే సంబంధిత అధికారులు మాత్రం నర్సరీల వైపు కన్నెత్తి చుడటం లేదని రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మొక్కలను నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ఎలాంటి రశీదులు ఇవ్వకుండా విక్రయిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

వాల్మీకిపురం : ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం చేపట్టనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి సమీపంలోని మాల మహానాడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలమహానాడు జాతీయ అధ్యక్షులు యమలా సుదర్శనం ఆదేశాల మేరకు భారత్ బంద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శివయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శులు సుధాకర్, శ్రీనివాసులు, నాయకులు ఇరగప్ప, సహదేవ, ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

మదనపల్లె : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ రిజర్వేషన్ సంఘర్షణా కమిటీ బుధవారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాలమహానాడు, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంద్‌ను విజయవంతం చేయాలని అధ్యక్షులు యమలాసుదర్శనం తెలిపారు. బుధవారం బంద్‌కు పట్టణంలోని విద్యా, వ్యాపార, వాణిజ్యసంస్థలు స్వచ్ఛందంగా సహకరించాల్సిందిగా కోరారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ



పాపిరెడ్డిగారిపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

కలకడ : దోమల నివారణతోనే మలేరియా జ్వరం నివారణ సాధ్యమని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా పాపిరెడ్డిగారిపల్లెలో స్థానిక పాఠశాల విద్యార్థులతో కలసి నోబెల్ అవార్డు గ్రహీత సర్ రొనాల్డ్ రాష్ చిత్రపటానికి నివాళి అర్పించారు. సర్‌రొనాల్డ్ రాష్ వైద్య రంగంలో అనేక సేవలు అందించారని గుర్తు చేసుకుని ఆయన సేవలను కొనియాడారు. మలేరియా వ్యాప్తికి దోమలే కారణమని కనుగొన్నాడన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. గ్రామవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ కె.సుబ్బరత్న, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల పేరుతో అక్రమ వసూళ్లు ఆపాలని ధర్నా



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మదనపల్లె సిటీ : విద్యార్థుల బస్‌పాసులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పేరుతో అక్రమ వసూళ్లు ఆపాలని కోరేఉతూ మంగళవారం స్థానిక టు డిపో కార్యాలయం ఎదుట ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘ నాయకులు ధర్నా చేశారు. ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు వినయ్ మాట్లాడుతూ బస్‌పాసులకు నిర్ణయించిన రుసుం కంటే అదనంగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. బస్సు పాసుల వెనుక ప్రిన్సిపాల్ సంతకం లేదని, సీలు లేదని విద్యార్థుల నుంచి రూ.50 వసూళ్లు చేస్తున్నారన్నారు. టు డిపోకు మేనేజర్ లేకపోవడం వల్ల అక్రమాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం ఆర్టీసీ ఇన్‌చార్జ్ డీఎం వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు శ్రీనాథ్, భానుప్రసాద్, మహేష్, షారూక్, బాలాజీ, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.


డప్పు కళాకారుల ద్వారా ప్రచారం నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దళితహక్కుల పోరాట సమితి నాయకులు

గుర్రంకొండ : మండల వ్యాప్తంగా నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల విజయవంతానికి డప్పు కళాకారులను వినియోగించుకొని ప్రచారం నిర్వహించాలని దళితహక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్ తహసీల్దార్ శ్రీనివాసులును కోరారు. మంగళవారం ఈమేరకు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల ఒకటో తేది నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారని అన్నారు. సదస్సుల నిర్వహణకు పదిరోజులు గడవు ఉన్నందున డప్పు కళాకారుల ద్వారా గ్రామాల్లో చాటింపు వేయించి ముందస్తు ప్రచారం నిర్వహించాలన్నారు. ఇందుకోసం డప్పు కళాకారుల సేవల్ని వినియోగించుకొని వారికి తగిన పారితోషకం ఇప్పించే చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘం నాయకులు పెద్ద గంగయ్య, రెడ్డెయ్య, రామకృష్ణ, వెంకట్రమణలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై శిక్షణ ఇస్తున్న అధికారులు

కేవీపల్లె : పారిశుధ్యంపై గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఈవోపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్ అన్నారు. మంగళవారం స్థానికం ఎంపీడీవో కార్యలయంలో పారిశుద్ధ్యం, చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యం పట్ల ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చెత్త సంపద కేంద్రాలను పరిశీలించి, నిర్వహణపై అవగాహన కల్పించారు.

కలకడ : చెత్త నుంచి సేంద్రీయ ఎరువు తయారు చేసి రైతులకు సేంద్రీయ ఎరువుల వినియోగం, ప్రయోజనాలను తెలియజేయాలని పంచాయతీల విస్తరణ, అభివృద్ధి అధికారి లతీఫ్‌ఖాన్ కోరారు. సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి రెండవరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కలకడ చెత్తసేకరణ కేంద్రాన్ని సందర్శించారు. తడిచెత్త, పొడి చెత్త ప్రత్యేక తొట్టిలో నిల్వ చేయడం, తడిచెత్తలో వానపాములు వదలి సేంద్రీయ ఎరువు తయారు చేయడం, ఎరువుల ద్వారా రైతులకు ప్రయోజనాలను తెలియజేయడం పంచాయతీలు విధిగా పెట్టుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు జిల్లా రాజగోపాల్‌రెడ్డి, విశ్వనాథ్, ప్యారీజాన్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండో రోజు మంగళవారం కూడా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీల్లో గుర్తించిన అంశాలపై విశ్లేషణ చేసి అవగాహన కల్పించినట్లు ఎంపీడీఓ కేఎన్ బాలాజీ పేర్కొన్నారు.

పీలేరు రూరల్ : చెత్తనుంచి సంపద సృష్టించాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రెండో రోజు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, పారిశుద్ధ్యం, చెత్త సంపద కేంద్రం నిర్వహణ శిక్షణ ఇచ్చారు. అనంతరం క్షేత్ర స్థాయిలో చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు.

రామసముద్రం : రామసముద్రం ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం రెండవ రోజు గ్రామాల అభివృద్ధిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్‌డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త నుంచి సంపద ఎలా చేయాలి, గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలపై అవగాహన కల్పించారు.

ప్రజల భాగస్వామ్యంతో వేడుకలు విజయవంతం

ఉత్సవ కమిటీ సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సత్కరిస్తున్న స్వాతంత్య్ర దినోత్సవ ఉత్సవ కమిటీ సభ్యులు

మదనపల్లె : పట్టణ ప్రజల భాగస్వామ్యం, ఉత్సవ కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో ముందస్తు స్వాతంత్య్ర సంబరాలను ఘనంగా జరుపుకున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు విజయవంతమైన నేపథ్యంలో మంగళవారం శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో అభినందన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నేటి తరం విద్యార్థులకు స్వాతంత్య్రస్ఫూర్తిని, మహనీయుల పోరాటగాథలను గుర్తుకు తెచ్చేలా మూడురోజుల పాటు ముందస్తు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు నిర్వహిద్దామని పిలుపునిచ్చిన వెంటనే స్పందించినందుకు ఉత్సవ కమిటీ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ రాటకొండ గురుప్రసాద్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపుమేరకు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పలువురు రూ.12,78,116 విరాళాలు అందించారన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల మీదుగా దాతలు, కమిటీ సభ్యులకు ఘనంగా సన్మానించారు.

కచ్చితమైన నివేదికలు అందించాలి

సబ్ కలెక్టర్ మేఘస్వరూప్



తట్టివారిపల్లె జంక్షన్‌లో కూడలి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : మండలంలోని తట్టివారిపల్లె జంక్షన్‌లో ఎన్‌హెచ్-71కు సంబంధించి కూడలి నిర్మాణానికి అవసరమైన స్థలసేకరణకు కచ్చితమైన నివేదికలు అందించాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం తట్టివారిపల్లె జంక్షన్‌లో కూడలి నిర్మాణంలో భాగంగా సర్వేనెం.1లో నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. ఏఏ భవనాలు ఎంతమేర కట్టడాలను కోల్పోతాయి, ఇళ్ల పట్టాదారులకు ఎంత మేర పరిహారం చెల్లించాల్సి ఉంటుంది తదితర అంశాలతో సమగ్ర నివేదిక తయారుచేయాల్సిందిగా ఆదేశించారు. అనంతరం మాలేపాడు పంచాయతీలో ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి రీ వెరిఫికేషన్ చేశారు.

సీనియర్ సిటిజెన్స్ సంఘాన్ని బలోపేతం చేయాలి

మదనపల్లె సిటీ : సీనియర్ సిటిజెన్స్ సంఘాన్ని బలోపేతం చేయాలని ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.మునిగోపాలకృష్ణ అన్నారు. మంగళవారం ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. సీనియర్ సిటిజెన్స్ సమస్యలను రాష్ట్ర స్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా మహిళా కార్యదర్శి ధనలక్ష్మి రాష్ట్ర స్థాయి అసోసియేషన్‌కు రూ.20 వేలు విరాళంగా అందజేశారు.

పంచాయతీలో జరిగిన అవినీతి నిగ్గుతేల్చాలి

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీలో జరిగిన అవినీతి నిగ్గు తేల్చాలని టీడీపీ నాయకులు చాపల సూరి, రామ్మూర్తి అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో రూ. 3 కోట్లు అవినీతి ఎదుర్కొంటున్న హబీబ్‌బాషా సర్పంచ్ పదవికి అనర్హుడని ఆరోపించారు. పంచాయతీ నిధులు దుర్వినియోగంపై షోకాజ్ నోటీసులు అందుకున్న హబీబ్‌బాషా, అధికారులు ఎలాంటి వివరణ ఇవ్వకుండా తిరిగి రెండో సారి సర్పంచ్ బాధ్యతలు చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. పంచాయతీలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనాథ్, లడ్డూ జాఫర్, నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షసాధింపు తగదు

– సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా

పీలేరు : రాజకీయ కక్షసాధింపు తగదని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు పంచాయతీ కార్యాలయంలో జరిగిన అవినీతి ఆరోపణలపై స్వయంగా కలెక్టర్‌కు, డీపీవోకు ఫిర్యాదు చేసి తనపైన, అలాగే 11 నెలల సర్పంచ్‌గా ఉన్న జీనత్ షఫీపై విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. తన పదవీ కాలంలో ఎక్కడా అవినీతికి పాల్పడలేదని, అభివృద్ధి పనులకు చెల్లింపులన్నీ ఎంబుక్ ఆధారంగానే జరిగాయని తెలిపారు. కరోనా కష్టకాలంలో కూడా పారిశుధ్య కార్మికులతో కలసి విశేష సేవలందించినందుకు బెస్ట్ సర్పంచ్ అవార్డు కూడా అందుకున్నట్లు తెలిపారు. తమపై జరిగిన అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని చెప్పారు. ప్రస్తుతం ఎంపీగా ఉన్న పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఫొటో పంచాయతీ కార్యాలయంలో పెట్టడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు నారే వెంకటరమణారెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, ఉదయ్ కుమార్, రమణ, శ్రీనాథరెడ్డి, జయపాల్‌రెడ్డి, సచిన్, కాలేషా పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

మదనపల్లె సిటీ : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ-1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. రాబోయే రోజుల్లో మరిన్ని కొత్త బస్సులు రానున్నాయన్నారు. దీంతో ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలన్నారు. వన్ డిపో ఓఆర్‌లో రీజియన్ పరిధిలో మొదటి స్థానం, టు డిపో రెండవ స్థానం నిలిచిందన్నారు.

రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం ఎంపిక

మదనపల్లె : మదనపల్లె పట్టణ, రూరల్ రేషన్ డీలర్ల నూతన కార్యవర్గ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. మంగళవారం స్థానిక బెబీవెల్‌కం హోంలో రేషన్ డీలర్ల సమావేశం జరిగింది. కార్యక్రమానికి రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణ, రూరల్ నూతన కార్యవర్గ ఎన్నిక జరపాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా పట్టణ అధ్యక్షుడిగా షేక్ ఇమామ్ ఖాసీం, ఉపాధ్యక్షురాలుగా ఎస్.ముంతాజ్, ప్రధాన కార్యదర్శిగా సుధీర్‌బాబు, రూరల్ అధ్యక్షులుగా బి.కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులుగా దివ్యానందం కవిత, ఎస్.షహనాజ్‌బేగ్, జి.మదన్ మోహన్, సుచరిత, నాగేంద్రబాబు, సలహాదారులుగా రాజన్న, మురళీ, కళాధర్, అంజప్ప, టీజీ.మహేశ్వర, ఖాజాహుస్సేన్‌లను ఎంపిక చేశారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తాం

పీలేరు : మదనపల్లె – తిరుపతి నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని ఆర్‌డీఓ రంగస్వామి అన్నారు. మంగళవారం బోడుమల్లువారిపల్లె, వేపులబైలు ప్రాంత రైతులతో చర్చించారు. కొన్ని సమస్యలతో కొందరికి పరిహారం అందకపోవడం, మరికొందరికి తక్కువ రావడం లాంటి సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ఫ్రీహోల్డ్ భూములు రీ వెరిఫికేషన్‌కు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీమా పాలసీలపై అవగాహన

తంబళ్లపల్లె : మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు బీమా పాలసీలపై సీసీలు, సంఘమిత్రలు అవగాహన కల్పించాలని డీపీఎం ధర్మరాజు కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ బీమా పాలసీపై అవగాహన కార్యక్రమం జరిగింది. చంద్రన్నబీమాతో పాటు 23 రకాల బీమా పాలసీలపై వివరించారు. మహిళా సభ్యులు బీమా పాలసీ తీసుకుంటే ప్రమాద సమయాల్లో ఆ కుటుంబానికి ఆర్థిక సహకారం కలుగుతుందన్నారు. వృద్ధాప్య పెన్షన్‌తో పాటు అభయహస్తం పెన్షన్ కూడా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, సీసీలు భద్ర, ఆదిలక్ష్మి, ముషీరాబేగం, సంఘమిత్రలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

– సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె : అక్రమ ఇసుక రవాణా సక్రమమేనని సమర్థించుకున్న టీడీపీ నాయకులు జేసీబీ మధు, ఆర్.జే.వెంకటేష్, నాదెళ్ల విద్యాసాగర్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చెయ్యాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో టీడీపీ మైనింగ్ మాఫియా అక్రమంగా తరలించి డంప్ చేసిన ఇసుక, మట్టి మేటలను రెడ్‌హ్యాండెడ్‌గా రెవెన్యూ అధికారులకు చూపించి సీజ్ చేయించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీ నాయకుల కనుసన్నల్లో ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా జరుగుతోందంటూ తాను టీడీపీపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానన్నారు. ఆరోపణలకు అనుగుణంగా బహుదా నుంచి అక్రమంగా తరలించి బార్లపల్లి వద్ద డంపింగ్ చేసిన 50 టిప్పర్ల ఇసుక ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు షంషీర్, మధుసూదన్ రెడ్డిలకు చెందినదేనన్నారు. భువనేశ్వరి నగర్ లో గుడి పక్కనే జేసీబీ వేణు మట్టి, ఇసుక డంప్ చేశారన్నారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్ పై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మైనింగ్ మాఫియాకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

చైల్డ్‌కేర్ సెంటర్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

– ఐసీడీఎస్ పీడీ శశికళ

మదనపల్లె సిటీ : చైల్డ్‌కేర్ సెంటర్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శశికళ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్దనున్న బాలసదనం తనిఖీ చేశారు. అనకాపల్లి జిల్లా కోటవురట్లోని హాస్టల్‌లో జరిగిన సంఘటన నేపథ్యంలో ప్రత్యేక బృందం బాలసదనంను తనిఖీలు నిర్వహించారు. బాలసదనంలో వంటగది, స్టోరు రూము, గదులు పరిశీలించారు. స్టోరు రూములో నిత్యావసర సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు అందజేస్తున్న మెనూను అడిగి తెలుసుకున్నారు.